# గూడెం పోకడ

ఊర్ మొత్తం పెపంచంమీన దడీమని లెగిసింది యుద్దం. యాడ జూసినా మడుసులు వుసిమీన నడుత్తుండారు.

పాలెం ఆదర్నించి యీదరికి, సీకట్లో రాయీ రప్పా తన్నుకుంటా, సిర సిరాడ్తా, బసవ పున్నయ్యగారు అంగలేసుకుంటా వొచ్చి, గూడెంలో నకా బూసాయి గుడిశ తలుపు సెక్కలమీన దబదబ బాదాడు "భూషాయ్, భూషాయ్?" అ నరుత్తా.

తలుపుదీసి. పంచ సరిజూసుకుంటా జెయిటికొచ్చాడు బూసాయి, కళ్లు నలుసుకుంటా.

"ఎవురూ? మీరంటండి పున్నయ్యగారూ! లోనకి రాండి మంచమ్మీన కూకుందురుగాని – ఏవేఁయ్, లెగూ."

"ఇక్కడికి చాల్లే తిరిగింది. ఇంకా మంచమ్మీన కూచోటంగూడా, సిగ్గు లేక! అవుతే ఏఁవిటా నీ వేషం భూషాయ్? ఇహ నీ చుట్టూతా తిరగటమే నాకు పననుకున్నావా ఏమిటీ?"

"పొద్దునొచ్చి పొయ్యారంటగా, యిది సెప్పింది లెండి."

"పొద్దున్నే ఏమిటీ! మున్నూటరవై ఘడియలూ మీ దేవిడీ కెదురుగా నేగా నా రాంభజనా! నిన్నొచ్చి పోయినా, మొన్నొచ్చి పోయినా, దాం దుంప దెగిరి చావు, అంత కనపడకుండా పోయినామట్రా ఎంత రోజులు మారినా? ఆ మాత్రం విశ్వాసం వుండక్కర్లా, మనిషన్నవాడికి? పొయిలోకి పుడకలేక చస్తున్నాం. మొన్నటినుంచీ ఆ కట్టెలు పగలేసి వెళ్ళమని మాటిమాటికీ చెప్పి పోతుంటే, యివ్వాల్టివరకు తేలకపాయె! పోనీ దగ్గిర్లో పిలుస్తే పలికేవాడుంటే. అనుకోవచ్చు. మా సొమ్ము ఎంతమంది తిన్నారో తింటున్నారో, ఎవడేడ్చాడు! 'ఏఁవిరా?' అనంటే, తొందర పనిమీద పోతున్నానండీ అని మొహం తప్పిచ్చే వాడే. మీ కుటుంబంమ్మీద వుండే నమ్మకం కొద్దీ, యిదుగో యిట్టా ఏడుస్తుంటా. పోనీ, యీ నాటికి వీళ్ళు రోజుకు రూపాయో, రెండో సంపాదించుకుంటున్నారని సంతోషంగా వుంటుంది. నీకు రూపాయే కావాలో, రెండే కావాలో, ముందు పనిజేసి నీకు కావల్సినంతే పట్టుకుబో. నిన్నెవరూ నేదెవరూ?"

"అంతే లెండి పున్నయ్యగారూ."

"అంతే నంటం కాదురా ! నా పరిస్థితేమిటో నీకు తెలుసుగా ? సొంతంగా యాదవలేక ఆ వున్నదంతా, ఇదిగో నీకూ, మీ గూడెంలో వాళ్ళకీ, తలా కొంచెం ముక్తాకిస్తిని. సొంతఁగా సాగించినన్నాళ్ళు, పిలుస్తే పలకటానికి మీలో ఎవరో జీతానికుండే వాళ్ళు, వెళ్ళిపోతుండేది. అసలు యీ రోగాల్తో బస్తీలకు పోతుంటంలో యీ ఖర్మ పట్టింది. పిల్లల కేవోఁ ఎక్కడో చదువులు. యిదేవోఁ రోగిష్టిది. పాపం, మా అమ్మ బతికున్నన్నాళూ ఏదో యింత చేసిపెట్టుండేది. యిహ, నేను మడే కట్టుకునేదా, దానికింత గంజే కాసేదా, కట్టెలే పగలగొట్టుకుంటూ కూచునేదా, మాట్లాడవేరా ఘూషాయ్ ?"

"చనక్కాయలకి పోతుండానండీ."

"ఒక్కరోజు భాగ్యానికి ఆ కూలీ నే నివ్వనన్నానుట్రా ?"

"పదెకరాలు నలుగురం వొప్పుకోటంలో సిక్కొచ్చిందండీ. యిగ యాడ్డిలెండి, యియ్యాల్తో అదీ అవనే అయిపాయె."

"యిక్కడ నాకూ అయింది, తడిసి మోపెడు ! తెల్లవార్ఝామున ఆవిడెగార్ని గుంటూరు తీసుకెళ్ళాలి. మధ్య మధ్య మనచేతిలో వున్న వైద్యమేమో చేస్తూ వొచ్చానూ—అది ఆవిడెగారికి చేదయింది ! గుంటూర్లో లేడీడాక్టరు దగ్గిర తియ్యగా వుంటుందట. కానీ ! యివ్వన్నీ మనకు అతీతం చూడూ ! ఇందులో రేపు తెల్లవారే సుముహూర్తం, మరి నీ బండి కట్టుకొస్తావా, చుండూరు స్టేషనుకూ ?"

"ఎట్టనండీ—"

"ఆఁ ?"

"ఎట్టనండి పున్నయ్యగారూ, పెచ్చుంద్రావయ్యగారి ఆడోరు యడ్డపల్లి ఎల్తాఁవంటే మాటిచ్చాను, ఎట్టనండీ !"

"వేళాకోళంట్రా ఘూషాయ్ !"

"అబ్బె యఁతొట్టు పద్తే అంతొట్టండీ ! యెడ్డపల్లిలో అప్పయ్యగారి కూతురు సోబనం అయితే, ఆడోరెల్లాలంటా, గెట్టిగా తెల్లారి బండి కట్టకరామని సుందర్రామయగారు సెప్పి పొయ్యారండీ."

"ఘూషాయ్ ? మీరు చిన్నప్పుడు మా యింటో తిని పెరిగారు. మీ నాయన మా ఇంటో జీతానికి చేస్తూ దాటిపోయినాడు. ఇవాళ రోజులు మారినయ్యని నే నంటంలా. ఇప్పటికీ మా తాటితోపులో, మీరేగాదు, వూళ్ళోవాళ్ళంతా మట్టద్దగిర్నుంచీ సమస్తం తీసుకెల్తుంటే నాకు తెలిసికూడా పల్లెత్తుమాట అనలా. రెణ్ణెల్ల కిందట నీ పెళ్ళాం చలిజ్వరంతో బాధపడ్తుంటే నాకు తోచిన మందేదో

యిచ్చి నయం జేశా ఇహ ఎన్నో వున్నయి, ఎందుకొచ్చినట్టు. ఈనాడు పెళ్ళానికి జబ్బుగా వున్నదని సిగ్గులేక నీ బండికి బతిమాల్తుంటే— వాళ్ళు అయిదిచ్చినా పదిచ్చినా— నాకు మొహం తిప్పి చూపిస్తావ్రటా భూషాయ్ ?"

"అబ్బె అంత మాటండి పున్నయ్యగారూ ! యడ్డపల్లినుంచి మద్దానం తిరిగొచ్చి, సందేల కట్టుకురామంటే కట్టుకొత్తా—"

"నీ మొహాన కొట్టుకో—ఛీ—తా—" అని సీదరిచ్చుకుంటా, సీకట్లోకి గబ గబ ఎల్లిపొయ్యాడు బసవ పున్నయ్యగారు.

కాసేపు అట్టనే నిలబడ్డాడు బూసాయి.

"ముంగల తలుపెయ్యి." అంది పెల్లాం సుక్కమ్మ.

"యివకాడ మడ్చి మాటినిపిచ్చుకోడేం!" అన్నాడు బూసాయి, సుక్కమ్మ పక్క కూకుంటా.

"ఏందయ్యా యినిపిచ్చుకునేదీ ? మద్దె నా కెందుకని వూరుకుండాగాని, ఆ జాన పున్నయ్యగారు బతివిలాడ్తుంటే కొయ్యకిమల్లే అటనే నిలబడిపోతివీ ? మాట దక్కే యవారమే నెట్టా యిదీ ?"

"ఓడన్నాడు దక్కుద్దనీ !"

"అయిదూ, పదీ, యిత్తాడెట్టా పెచ్చుంద్రామయ్యగారూ !"

"పదా, యాబయ్యా ?"

"మరేంది పున్నయ్యగారావజానంటంటే ?"

"ఆచలు—ముంగల మడ్చికి మాటి త్తిని గదంటే !"

"ఇత్తే ఇచ్చావులే, ఆరి సొమ్ము దిన్నాం. నాయం గుండదు ఎల్లిరా."

"ఆ మాత్రం నాయం యీ యదవకు తెలిత్తేనా, నీకు తెల్చింది గానీ ! ముంగలో పెద్దమడ్సికి మాటిత్తినీ, మద్దానం ఎటనో తిరిగొచ్చి, కాత్తె ఆగి బండి కడ్తాన టుంటినీ, దుత్త పగలేసి నట్టెల్లిపాయె !"

"ఎన్నాలు బొయినా పీడ మన మీనకే వొచ్చుద్ది ! ఆయనేమో ఆనాడు మీరు మా సొమ్ము దిన్నారు, యీనాడు మీకు మందుబోశాను, అనంటుండె ! ఓరు కాదన్నారూ ? లెగవరా, అంటే లెగవటానికి యివకాడ మడిసి సిక్కులు గమనియ్యాక్కర్లా ?"

"అవకాడ బో సంబరమ్మిన, సోబనాని కెల్లాల బండికట్టరా అంటే, కడ్తా నంటిని !"

"కూలీ దొరకనన్నాలు కూడులేక సత్తావుంటే, 'గాడ్దెకొడుకులు పన్జేసి సావరు' అనంటిరి ! యియ్యాల కూలి గిరాకయి, ఆ డీడకు బొయి నాలుగు

డబ్బులు తంటాలు బడ్తంటే, 'యిస్వాసం లేదీళ్ళకి' అనంటుంటిరి !"

"ఓ రోజు పేళ్ల పగలెయటానికి పద్దినాల కూలి పోనూకమంటాడు. నాయం వుండక్కర్లా ?"

"......... "

"......... "

"ముంగల తను వొప్పందం జేసుకునుంటే, అనక పద్దినాలపని పోయిం దని ఏడుత్తే ఏడ్సుకుండేవోళ్ళం."

"కాదులే !"

"ఏంది కాదూ ?"

"ఆ మద్దె రామయగారు 'దడి బిగిత్తావంట్రా రూపాయిన్నరిత్తానూ ?' అనంటే, పని కొప్పుకున్నానండీ, అనన్నా. అన్నీ వుత్తదే !"

"అదేందీ ! డబ్బు ఎక్కవై పోతుండదెట్టా ?"

"అనాల్చి అన్నా లేయే !"

"ఆ దేందీ ! యీ మడ్చికేం గుబు లెట్టా !"

"ఎవురికి నాకా ? నువ్వనాల్చిందే ! ఆమైన బామ్మనయ్యగారి సందులోకి ఎల్లేతలికీ, అదిగో ఆ పద్దినాల రెడ్డెమ్మగారి కూలి దొరికింది."

"నీకు ముంగల తెల్చా, అవజాన కలిసొచ్చుద్దనీ ? యింకా నయం అట్ట సెయిమాక ఎప్పుడూ."

"ఇన్నాలమించి మన్ని ఏడిపిత్తే బాగుండ దెట్టా ? నువ్వేగా యింతకి ముంగలంటివీ ?"

"నేనన్నానెట్టా ? ఏవోఁ. అయినా పెద్దోరితో కూడినెవారం. రేపు మనకి గడ్డు దినాలొత్తే, ఆరేగందా మనకి దిక్కూ ? కాత్తె కనిబెట్టి పోయ్యాఁ, బాగుంటదీ."

"దిక్కూ ! ఓరే మనకి దిక్కూ ? దిక్కంటే, పగలల్లా రేత్రల్లా వొల్లు యిరుసుకుండా కడుపు కక్కుర్తిగుంటదేం ? ఈపుమీన బత్తాఎత్తుకుంటే కూలి డబ్బు లిత్తుంటారు. యీ మయిన నువు ఎల్లి పట్టుకోక కావాలని అడుగూ, ఓడిత్తాడో సూద్దాం ? యియ్యాల నువు రూపాన్నర సంపాయిత్తుండా, మరసనాడు పడకేత్తే దానికది చరీపోటం లేదంటే ? గడ్డు దినాలు యాడో వుండయ్యంటా వేందే ? రోజూ కూలిగిడ్తుండదీ. అదీ సావుగా వుంటే యిగ ఎవురే నిన్ను కనిబెట్టుండేదీ ?"

"నీకేందో గుబులు మల్లింది !"

"పాయే!"

"సందుసూసి యాడో పిసుకుతాళ్ళే పున్నయ్యగారు!"

"ఓడు కాదన్నాడు శాతకాదనీ? ఓకోపు నువుగూడా పట్టు"

"యిగ సాల్లే వూరుకో!"

"ఏమ్మా?"

"యియ్యాలకి పొఁదుకో, తెల్లారి సోబనాని కెల్లాల గూడా."

"ఏందో అఁటుండావే–?"

"అబ్బోప్–"

★